క్లుప్తంగా

నగరంలో ట్రాఫిక్ బోర్డులు ఏర్పాటు



తాడేపల్లిరూరల్: మంగళగిరి నగరంలో ప్రధాన కూడలి ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ట్రాఫిక్ బోర్డులను పట్టణ సీఐ ఎం. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేశారు. సీఐ ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ నగరంలోని ప్రధాన కూడలి ప్రాంతాలైన ఎయిమ్స్ హాస్పిటల్‌కు వెళ్లే రోడ్డు, పాత బస్టాండ్, తెనాలి రహదారి, రాజీవ్ గృహకల్ప రోడ్, ఆటోనగర్ ఆర్టీసీ గ్యారేజీకి వెళ్లే రహదారుల వద్ద ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు ఈ ట్రాఫిక్ బోర్డులను ఏర్పాటు చేశామని, ఎస్ఆర్ఎం నుంచి వచ్చే బస్సులు పాత బస్టాండ్ వద్ద కాకుండా నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద నుంచి యుటర్న్ తీసుకోవాలని సూచించారు. మెయిన్ బజార్, మిద్దె సెంటర్ వద్ద కూడా ట్రాఫిక్ బోర్డులను ఏర్పాటు చేశామని, నగర ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ, ఏర్పాటు చేసిన ట్రాఫిక్ బోర్డులను అనుసరించాలని ప్రజలు పోలీసులకు సహకరించాలని సీఐ ఎం.శ్రీనివాసరావు ఆయన కోరారు.

శీతలాంబకు విశేష పూజలు



ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామంలోని శీతలాదేవి, నవగ్రహ విగ్రహాలు, పోలేరమ్మకు బుధవారం భక్తులు విశేష పూజలు చేశారు. ఉదయాన్నే మహిళలు బిందెల్లో నీటితో గ్రామంలో ఊరేగించి ఆయా విగ్రహాలకు జలాభిషేకాలు చేశారు. పొంగళ్లు పొంగించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అర్చకుడు ఉమాపతిశాస్త్రి ఆధ్వర్యంలో శీతలాదేవికి అష్టోత్తర, సహస్రనామ పూజలు చేశారు. భక్తులకు అన్నప్రసాద వితరణ కావించారు.

24 నుంచి పేరేచర్ల - ఫిరంగిపురం రైల్వే గేటు మూసివేత

లక్ష్మీపురం: పేరేచర్ల - ఫిరంగిపురం మధ్య ఉన్న రైల్వే గేటును ఈనెల 24వ తేదీ ఉదయం 7గంటల నుంచి 26వ తేదీ రాత్రి 7 గంటల వరకు మూసి వేస్తున్నట్లు రైల్వే సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ బుధవారం వెల్లడించారు. లెవల్ క్రాసింగ్‌లో రైలు పట్టాలపై అత్యవసర మరమ్మతులు చేస్తున్నందున ఈ గేటు మూసివేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

శాంతియుతంగా వ్యవహరించాలి

దొండపాడులో శాంతి కమిటీ సమావేశం నిర్వహించిన డీఎస్పీ ఇ.అశోక్ గౌడ్

దొండపాడు(తాడికొండ): ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ప్రజలు తాత్కాలిక ఆవేశాలకు లోను కాకుండా శాంతియుతంగా వ్యవహరిస్తే గ్రామంలో ప్రశాంత పరిస్థితులు ఏర్పడతాయని, అందరూ సహకరించాలని తుళ్లూరు డీఎస్పీ ఇ.అశోక్ గౌడ్ సూచించారు. తాడికొండ మండలం దొండపాడు గ్రామంలో డీఎస్పీ అధ్యక్షతన గ్రామంలోని ఇరు వర్గాలతో విడివిడిగా శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సొంత నిర్ణయాలతో ముందుకెళ్లి వివాదాస్పద పరిస్థితులకు అవకాశం కల్పించకుండా, గ్రామంలో ప్రశాంత పరిస్థితులు ఏర్పడేందుకు సహకరించాలన్నారు. సీఐలు, షేక్ సుభానీ, సీహెచ్ అనురాధ, పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేడు సాక్షి భావన్నారాయణ స్వామి రథోత్సవం



పొన్నూరు: పట్టణంలోని శ్రీ సుందరవల్లి రాజ్యలక్ష్మి సమేత సాక్షి భావన్నారాయణ స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉదయం స్వామికి పంచామృత స్నపన, తిరువంజనోత్సవం, రాత్రి గజవాహనంపై స్వామికి ఎదురు కోలోత్సవం, అనంతరం స్వామి వారి కల్యాణ మహోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. గురువారం స్వామివారి దివ్య రథోత్సవం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి మండేపూడి పానకాలరావు తెలిపారు. మధ్యాహ్నం మూడు గంటలకు ప్రారంభమయ్యే రథోత్సవంలో భక్తులు విశేష సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

బాధితులకు ఆపన్న హస్తం

- దేశానికే ఆదర్శంగా నిలిచిన రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి
- రూ 1.35 కోట్లతో 300 మందికి మంగళకరం పేరుతో కృత్రిమ చేతుల పంపిణీ
- సంతోషం వ్యక్తం చేసిన లబ్ధిదారులు



కృత్రిమ చేతుల పంపిణీని ప్రారంభిస్తున్న నిర్వాహకులు(ఫైల్)

మంగళగిరి: రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి పేదలకు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ప్రజలు కొనియాడుతున్నారు. ఈనెల 21 నుంచి దివ్యాంగులకు కృత్రిమ చేతులు పంపిణీని చేపట్టి అనేకమందికి ఆపన్న హస్తం అందించిన రోటరీ సేవలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

కృత్రిమ చేతుల పంపిణీ అభినందనీయం..



పేదవారు కృత్రిమ చేతులు చేయించుకోవాలంటే చాల ఖర్చు అవుతుంది. మంగళకరం పేరుతో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి వారు చేపట్టిన కార్యక్రమం అభినందనీయం. కృత్రిమ చేతులు పంపిణీతో పాటు వాటిని ఎలా వినియోగించాలో కూడా శిక్షణ ఇచ్చారు. రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి నిర్వాహకులకు అభినందనలు.

– సగరం బాల వెంకట సుబ్రమణ్యం

ఉచితంగా ఏర్పాటు చేశారు..



రోడ్డు ప్రమాదంలో చేతులు కోల్పోయాను. ఎన్నో ఆసుపత్రులు తిరిగినా ఉపయోగం లేకుండా పోయింది. మంగళగిరిలో కృత్రిమ చేతుల పంపిణీ ఉందని తెలుసుకుని రిజిస్టర్ చేయించుకున్నాను. మేం కూలి చేసుకుని జీవించే వాళ్లం. కృత్రిమ చేతు లు చేయించుకోవాలంటే చాలా ఖర్చు అవుతుంది. మంగళగిరి రోటరీ క్లబ్ వారు ఉచితంగా ఇచ్చారు. చాలా సంతోషంగా వుంది.

– కర్రి సన్యాసి నాయుడు, విశాఖపట్నం

నా పనులు నేను చేసుకోగలను..



నేను చిన్నతనంలో జరిగిన ప్రమాదంలో చేయి కోల్పోయాను. అప్పటి నుంచి నా తల్లిదండ్రులు ఎంతో బాధ పడుతున్నారు. ఇప్పుడు మంగళకరం పేరుతో రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో నాతో పాటు ఎంతో మందికి కృత్రిమ చేతులు అందజేయడం ఆనందంగా వుంది. ఇప్పుడు నా పనులు నేను సొంతగా చేసుకోగలను.

– బండ్లమూడి లోషన్ సాయి కార్తీక్, సిరిపురం, గుంటూరు జిల్లా

చేయి అమర్చి.. శిక్షణ సైతం ఇచ్చారు..



నేను ప్రమాదంలో చేతిని పోగొట్టుకున్నారు. ఇక చేయి లేదు అని రోజు బాధపడుతుండగా, రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో కృత్రిమ చేతులు ఇస్తున్నారని తెలిసి వచ్చాను. కృత్రిమ చేతిని అమర్చి డాక్టర్లు ఎలా వినియోగించుకోవాలో సలహాలు ఇచ్చారు. రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి వారికి కృతజ్ఞతలు.

– పొట్లకాయల బేబి, సింగరేణి, ఖమ్మం జిల్లా

అందరి సహకారంతో విజయవంతం



అందరి సహకారం వల్లే 300 మందికి కృత్రిమ చేతులు పంపిణీ చేశాం. జర్మనీ, న్యూజిలాండ్, ఆఫ్రికాల నుంచి ప్రత్యేక బృందాలు వచ్చి బాధితులకు శిక్షణ ఇచ్చి హ్యాండ్స్‌ను అందజేశారు. రూ.1.35 కోట్లు ఖర్చు చేసి రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో కృత్రిమ చేతులు పంపిణీ చేయడం జరిగింది.

– ఇసునూని అనిల్ చక్రవర్తి, ఫౌండేషన్ చైర్మన్

సాగు పనుల్లో ఎమ్మెల్యే ఆర్కే నిమగ్నం



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి

తాడేపల్లిరూరల్: నిన్న మొన్నటివరకు జరిగిన ఎన్నికల ప్రచారంలో అలుపెరుగకుండా వైఎస్సార్ సీపీ అభ్యర్థుల గెలుపుకోసం అహర్నిశలు కృషి చేసిన మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) కొంత విరామం రావడంతో వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. బుధవారం ఫిరంగిపురం మండలం వేమవరం గ్రామంలో తనకున్న వ్యవసాయ భూమిలో పండ్లతోటలు, ఇతర మొక్కలను ఏర్పాటు చేశారు. ఆ పొలంలో దుక్కిదున్నడంతో పాటు చెట్లకు పాదులు చేయడం ఇతర పనులను స్వయంగా ఆయనే చేస్తూ వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు.

లైబ్రరీలో వేసవి శిక్షణ తరగతులు



పిల్లలకు జీవిత చరిత్రలను వినిపిస్తున్న రమాదేవి

తెనాలి: స్థానిక నెహ్రూరోడ్డులోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం నీతికథలు, మహనీయుల జీవిత విశేషాలను వినిపించారు. వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవటం, పాఠశాల స్థాయి నుండే విద్యార్థుల్లో గ్రంథాలయాన్ని సందర్శించటం, చదివే అలవాటును పెంపొందించటం తరగతుల ముఖ్య ఉద్దేశ్యంగా గ్రేడ్–1 లైబ్రేరియన్ కె.రమాదేవి తెలియజేశారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి 11.30 గంటల వరకు జరిగే ఉచిత శిక్షణ శిబిరాన్ని 6–10 తరగతుల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మినరల్ వాటర్ అందుబాటులో ఉందనీ, విరామ సమయంలో అల్పాహారం ఇస్తున్నట్టు తెలిపారు. పుస్తకాలు చదివించటం, శతక పద్యాలు నేర్పించటంతోపాటు చేతిరాతలో శిక్షణ, ఇండోర్ గేమ్స్ ఆడిస్తామని కూడా వివరించారు. తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులను గ్రంథాలయానికి వచ్చేలా సహకారం అందించాలని విజ్ఞప్తిచేశారు. పట్టణానికి చెందిన అంకినీడు ప్రసాద్ రూ.2800 విలువ గల 1969 నుంచి 2012 వరకు వచ్చిన చందమామ కథలు పుస్తకాలను లైబ్రరీకి విరాళంగా ఇచ్చినట్టు తెలిపారు.

జీవ వైవిధ్య రక్షణకు కృషి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న అవగాహన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: జీవవైవిధ్యాన్ని జాతీయ సంపదగా భావించాలని అవగాహన సంస్థ సభ్యులు పేర్కొన్నారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో మంగళవారం ప్రపంచ జీవవైవిధ్య దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పరార్యవరణ ప్రచారకులు వి.సత్యనారాయణ మాట్లాడుతూ మానవునికి జీవ వైవిధ్యానికి అవినాభావ సంబంధం ఉందన్నారు. పెరుగుతున్న జనాభా, పట్టణీకరణ, పారిశ్రామికీకరణ వలన సహజవనరులపై తీవ్ర ఒత్తిడి పెరిగి భూగోళం కాలుష్యానికి గురవుతోందన్నారు. మానవుడు అభివృద్ధి పేరుతో ప్రకృతిని అనేక విధాలుగా ధ్వంసం చేస్తున్నారన్నారు. ఫలితంగా అసంఖ్యాక జంతు, వృక్ష జాతులు అంతరించి పోతున్నాయన్నారు. విశ్రాంత జంతుశాస్త్ర శాఖాధిపతి డాక్టర్ ఆర్.రామచంద్రరావు మాట్లాడుతూ 21వ శతాబ్దంలో పర్యావరణ విధ్వంసం, జీవజాతుల నష్టం పట్ల ప్రపంచ దేశాలన్ని ఆందోళన వెలిబుచ్చాయన్నారు. పటిష్టమైన చట్టాలతోనే జీవవైవిధ్య మనుగడ సాధ్యమవుతోందన్నారు. విద్యావేత్త ముప్పాళ్ల ప్రసాదరావు, సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

పుస్తకాలు విజ్ఞాన భాండాగారాలు



పెదకాకాని గ్రంథాలయంలో జరిగిన సమ్మర్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులు

పెదకాకాని: విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని పుస్తకాలు విజ్ఞాన భాండాగారాల వంటివని గ్రంథాలయాధికారి వేముల విజయ్ కుమార్ అన్నారు. పెదకాకాని లూధర్‌గిరి కాలనీ గ్రంథాలయంలో ఈ నెల 15 నుంచి ప్రారంభమైన వేసవి శిక్షణా తరగతులు జూన్ 7 వరకు జరుగుతాయన్నారు. ఈ సందర్భంగా బుధవారం జరిగిన శిక్షణా శిబిరంలో గ్రంథాలయాధికారి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు కథలు చెప్పటం, వారిచే కథలు చెప్పించటం జరిగిందన్నారు. ఆటలు ఆడించడంతో పాటు పరుగు పందెం పోటీలు నిర్వహించినట్లు చెప్పారు. పుస్తక సమీక్ష, స్టోరీ టెల్లింగ్ అంశాలపై తర్ఫీదునివ్వటం జరిగిందన్నారు. విద్యార్థులు పుస్తక పఠనం అలవాటు చేసుకోవాలని సూచించారు. విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి జూన్ 7న బహుమతులు ఇవ్వటం జరుగుతుందన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖనంలో శిక్షణ



ఫిరంగిపురం: మండలకేంద్రంలోని గాలిబాలి శాఖ గ్రంథాలయంలో వేసవిశిక్షణ తరగతుల్లో భాగంగా బుధవారం జెడ్పీపాఠశాల ఉపాధ్యాయుడు రామస్వామి విద్యార్థులకు చిత్రలేఖనంపై శిక్షణ ఇచ్చారు. అనంతరం ఇంగ్లీషు గ్రామర్, మాట్లాడే విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ఇన్‌చార్జి గ్రంథాలయాధికారి పి.జేమ్స్, డి.కృష్ణమూర్తిలు కార్యక్రమాలు పర్యవేక్షించారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

తెనాలిరూరల్: రైలు నుండి జారిపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన కొలకలూరు ఓవర్ బ్రిడ్జి సమీపంలో బుధవారం చోటు చేసుకుంది. పట్టాల వెంబడి మృతదేహం ఉందన్న సమాచారంతో తెనాలి జీఆర్పీ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతుడి వయసు సుమారు 50 ఏళ్లు ఉంటుంది. ముఖం ఛిద్రమైంది. కుడి చేతికి ఎరుపు రంగు కాశీ దారం కట్టుకుని ఉన్నాడు. మృతదేహాన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తొలితరం దళిత ఉద్యమకారుడు భాగ్యరెడ్డి వర్మ

నెహ్రూనగర్: తరతరాలుగా అంటరానితనానికి అవమానాలు అణిచివేతకు గురైన దళితుల తలరాతలు మార్చిన తొలి ఉద్యమ కారుడు భాగ్యరెడ్డి వర్మ అని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షుడు పగల ప్రకాష్ పేర్కొన్నారు. ఉమ్మడి మద్రాస్ ఆంధ్ర రాష్ట్రాల్లో దళితుల అణిచివేతకు, అవమానాలకు వ్యతిరేకంగా సామాజిక ఉద్యమాన్ని ఉధృతం చేసిన గొప్ప మేధావి భాగ్యరెడ్డి వర్మ అని కొనియాడారు. బుధవారం అరండల్‌పేటలోని భీమ్ భారత్ కార్యాలయంలో భాగ్యరెడ్డి వర్మ 136వ జయంతి కార్యక్రమం జరిగింది. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత బాలికలకు పాఠశాలలను ఏర్పాటు చేశారని, దేవదాసి, బసవి, జోగిని వ్యవస్థ లాంటి దురాచా రాలను రూపుమాపేందుకు ఉద్యమించారన్నారు. నేటి యువత మహనీయుల ఆశయాలను ఆలోచనలను కొనసాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

లక్ష్మీ నృసింహస్వామికి అష్టోత్తర కలశాభిషేకం

తెనాలి: పట్టణ నాజరుపేటలోని శ్రీలక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో స్వామివారి జయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం 108 కలశాల పానకంతో అభిషేకం నిర్వహించారు. శ్రీశృంగేరి శ్రీవిరూపాక్ష శ్రీ పీఠపాలిత పరశివానంద భారతి స్వామి చేతుల మీదుగా ఈ వేడుకను జరిపించారు. పరశివానంద భారతి స్వామి భక్తుల నుద్దేశించి మాట్లాడుతూ తన భక్తుడైన ప్రహ్లాదుడిను రక్షించటం కోసం మహావిష్ణువు నరసింహ స్వామిగా అవతరించినట్టు చెప్పారు. రాక్షసుడైన హిరణ్యకశ్యపుడిని సంహరించి, తన భక్తుడికి అభయమిచ్చినట్టు తెలిపారు. నృసింహ జయంతి సందర్భంగా స్వామి వారిని దర్శించుకుంటే జన్మ జన్మ పాపాలు తొలగిపోతాయని చెప్పారు. నృసింహస్వామి నాజరుపేటలో 1906లో వెలిశారని, స్వామిని దర్శించుకోవటం స్థానిక ప్రజల అదృష్టమన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ కె.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ జూన్ ఒకటో తేదీన శ్రీ హనుమత్ జయంతి, జూన్ 5న శ్రీలక్ష్మీ నృసింహస్వామి కళ్యాణ మహోత్సవం అనంతరం అన్నసమారాధన జరుగుతుందని తెలియజేశారు. భక్తులు పెద్దసంఖ్యలో విచ్చేసి స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు. కార్యక్రమాన్ని విజయకుమారి, శ్రీలక్ష్మి, ఆలయ పూజారి భార్గవ్ పర్యవేక్షించారు.

ఫలితాల రోజు అల్లర్లకు పాల్పడితే చర్యలు



సీతానగరంలో యువకులతో మాట్లాడుతున్న సీఐ కల్యాణ్‌రామ్



దుగ్గిరాలలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు

తాడేపల్లి సీఐ కల్యాణ్‌రామ్

తాడేపల్లిరూరల్: జూన్ 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరిగే కౌంటింగ్ కేంద్రాల వద్దకు అనుమతి ఉన్న వారు తప్ప మిగిలిన వారు ఎవరూ వెళ్లడానికి వీలులేదని తాడేపల్లి సీఐ కల్యాణ్‌రామ్ అన్నారు. బుధవారం తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరంలో తమ సిబ్బందితో పాటు అదనపు బలగాలతో కలిసి కార్డన్ సెర్చ్ నిర్వహించిన పలుచోట్ల సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు నార్త్‌జోన్ డీఎస్పీ సీహెచ్ రవి కాంత్ సూచనల మేరకు కౌంటింగ్ సందర్భంగా ఎటువంటి అల్లర్లు జరగకుండా ముందస్తుగా సీతానగరంతో పాటు పలు ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించి రాజకీయ పార్టీల్లో చురుకుగా ఉండే వారితో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. ఫలితాల రోజు అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్డన్ సెర్చ్‌లో తాడేపల్లి ఎస్ఐలు ప్రతాప్, రమేష్, సాయిప్రసాద్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

దుగ్గిరాల మండలంలో...

తాడేపల్లిరూరల్: జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడనున్న నేపథ్యంలో ప్రజలు గుంపులు గుంపులుగా గుమికూడకూడదని ఎటువంటి ర్యాలీలు నిర్వహించరాదని దుగ్గిరాల ఎస్ఐ మహేంద్ర ప్రజలకు సూచించారు. బుధవారం దుగ్గిరాల మండల పరిధిలోని పెదకొండూరు, చిలువూరు, ఈమని గ్రామాల్లో పోలీసు సిబ్బంది, ఇండియా టిబెట్ బోర్డర్ ఫోర్స్ కేంద్ర బలగాలతో రూట్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహేంద్ర మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వివిధ పార్టీల రాజకీయ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి ఫలితాల రోజు అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా చర్యలు చేపడుతున్నామని ఆయన తెలిపారు.

తాడేపల్లిరూరల్: జూన్ 4వ తేదీన సార్వత్రిక ఎన్నికల ఫలితాలు విడుదల సందర్భంగా ఎటువంటి అల్లర్లకు పాల్పడకుండా ఉండాలని మంగళగిరి రూరల్ ఎస్ఐ క్రాంతి కుమార్ అన్నారు. బుధవారం పెదవడ్లపూడి గ్రామంలో స్థానికులతో మాట్లాడుతూ ఎన్నికల ఓట్ల లెక్కింపుకు కొద్ది రోజులు మాత్రమే ఉందని, ఉన్నతాధికారుల సూచనల మేరకు మండలంలోని అన్ని గ్రామాల్లో పోలీసులు ముందస్తు సూచనలు, హెచ్చరికలు జారీ చేశారని తెలిపారు. ఎవరైనా అల్లర్లు సృష్టిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రశాంత వాతావరణానికి సహకరించాలి..

మేడికొండూరు: ఎన్నికల కౌంటింగ్ రోజు ప్రశాంతవాతావరణానికి ప్రజలంతా సహకరించాలని మేడికొండూరు సీఐ దార్ల జయకుమార్ తెలిపారు. పోలీసు స్టేషన్‌లో బుధవారం మండలలోని పలు గ్రామాల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు కౌంటింగ్ రోజు ఎటువంటి అవాంచనీయ సంఘటనలకు పాల్పడకుండా సామరస్యంగా ఉండాలన్నారు. గ్రామాల్లో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయకూడదన్నారు. అలాంటివారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతోందన్నారు. శాంతియుత వాతావరణం నెలకొల్పేందుకు తగిన చర్యలు తీసుకున్నామన్నారు. మండలంలోని పలు సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. గ్రామాల్లో అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా పోలీసులకు సహకరించాలని కోరారు.

ఘనంగా లక్ష్మీ నృసింహస్వామి జయంతి



నృసింహస్వామికి ప్రత్యేక పూజలు

తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా మంగళగిరిలో కొలువై వున్న లక్ష్మీ నృసింహస్వామి వారి (ఆవిర్భావ) జయంతి ఉత్సవాలను ఆలయ కార్యనిర్వహణాధికారి రామకోటిరెడ్డి ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఈఓ రామకోటిరెడ్డి మాట్లాడుతూ ఈ ఉత్సవాల్లో భాగంగా బుధవారం అర్చకులు శ్రీనివాస దీక్షితులు ఆధ్వర్యంలో ఉదయం 4 గంటలకు విశేష అభిషేకం, చందన అలంకారం, 8 గంటలకు పారిమార్మిక హోమం, నారసింహ హోమం అంగరంగ వైభవంగా భక్తులనడుమ నిర్వహించామని, సాయంత్రం 6 గంటలకు నామకరణం, హోమం, ఆస్థాన కార్యక్రమాలు ఘనంగా నిర్వహించామని, 23వ తేదీ గురువారం ఉదయం 7 గంటలకు నారసింహ మూలమంత్ర హోమం, మహా పూర్ణాహుతి కార్యక్రమాలు, 9 గంటలకు శాంతి కళ్యాణం, సాయంత్రం స్వామి వారి గ్రామోత్సవాన్ని నిర్వహించనున్నామని తెలిపారు. భక్తులు ఈ కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

ఓట్ల లెక్కింపు విధివిధానాలపై సమగ్ర అధ్యయనం



అధికారులతో సమావేశమైన నగర కమిషనర్, తూర్పు ఆర్ఓ కీర్తి చేకూరి

నగర కమిషనర్, తూర్పు ఆర్ఓ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు విధివిధానాలను కౌంటింగ్ సిబ్బందితో పాటు అధికారులు కూడా సమగ్రంగా అధ్యయనం చేయాలని నగర కమిషనర్, తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కీర్తి చేకూరి ఆదేశించారు. బుధవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో జూన్ 4న జరగనున్న ఓట్ల లెక్కింపు ఏర్పాట్లపై తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 4న ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు జరుగుతుందని, విధులు కేటాయించబడిన అధికారులు ఓట్ల లెక్కింపుపై ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను సమగ్రంగా అధ్యయనం చేయాలన్నారు. ఓట్ల లెక్కింపులో తొలుత పోస్టల్ బ్యాలెట్స్, సర్వీస్ ఓట్లు లెక్కించడం జరుగుతుందని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్‌లో వ్యాలిడ్, ఇన్ వ్యాలిడ్ ఓట్లను ఎలా వేరు చేయాలో ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు సంబంధించిన సూచనలను ఆర్ఓలు, ఏఆర్ఓలు తప్పనిసరిగా చదివి అర్థం చేసుకోవాలన్నారు.

ఐడీ కార్డులు తప్పక ధరించాలి..

కౌంటింగ్ విధులకు ఎంపికైన వారు తప్పనిసరిగా ఐడీ కార్డ్ లు ధరించాలని, కౌంటింగ్ కేంద్రంలోనికి సెల్‌ఫోన్ అనుమతి లేనందున సెల్‌ఫోన్ డిపాజిట్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని డీఈఈని ఆదేశించారు. కౌంటింగ్ కేంద్రంలో తగిన టేబుల్స్, ఇంటర్నెట్ కనెక్షన్, కంప్యూటర్లు, ఆపరేటర్లు ఉండేలా పర్యవేక్షణ చేయాలని ఈఈని, విధుల్లో ఉండే అధికారులు, సిబ్బందికి టిఫిన్, భోజన సదుపాయాలు కల్పించాలని డీఈఈని ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి ఈవిఎంలు తీసుకొచ్చేందుకు, అధికారులు, లెక్కింపు సిబ్బంది, అభ్యర్థులు, ఏజంట్లు లెక్కింపు కేంద్రంలోనికి వచ్చేందుకు వేరువేరుగా మార్గాలు ఉండాలలని, అవసరమైతే బారికేడింగ్ చేపట్టాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కౌంటింగ్ కు అవసరమైన మెటీరియల్‌ను చెక్ లిస్ట్ మేరకు సిద్ధం చేయాలని మేనేజర్‌ని ఆదేశించారు. సమావేశంలో ఏఆర్ఓలు సునీల్ కుమార్, భీమరాజు, ప్రదీప్ కుమార్, వెంకటలక్ష్మీ, డిప్యూటీ కమిషనర్ వెంకట కృష్ణయ్య, ఈఈలు సుందర్‌రామిరెడ్డి, శ్రీనివాస్, డిఈఈ రమేష్ బాబు, మేనేజర్ ఎస్.ఎస్.ప్రసాద్, ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు, సూపరింటెండెంట్‌లు పాల్గొన్నారు.